సాక్షి
జగిత్యాల
శనివారం । 22 । ఏప్రిల్ । 2023



పాఠశాల సందర్శన

కోరుట్ల : వెంకటాపూర్, కల్లూరు ఇటుక బట్టీల వర్క్‌సైట్ పాఠశాలలను డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించారు.



25నుంచి మెగా 'ఇంపాక్ట్'

జగిత్యాల: నిరుద్యోగుల కోసం ఈనెల 25, 26 తేదీల్లో 'మెగా ఇంపాక్ట్' నిర్వహిస్తామని గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్ తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0/24.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉండి, ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

భరణి నక్షత్రపూజలు



పూజలు అందుకుంటున్న యమధర్మరాజు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీయమధర్మరాజు ఆలయంలో భరణి నక్షత్రం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేద పండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ముత్యాల శర్మ మంత్రోచ్ఛారణలతో పూజలు అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉచిత న్యాయ సాయం



మాట్లాడుతున్న జిల్లా సివిల్ జడ్జి ప్రసాద్

మల్యాల(చొప్పదండి): రైతులు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఉచిత న్యాయ సలహా తీసుకోవాలని, ఇందుకోసం పారా లీగల్ వలంటీర్ అందుబాటులో ఉంటారని జిల్లా సివిల్ జడ్జి కె.ప్రసాద్ అన్నారు. స్థానిక రైతువేదికలో వ్యవసాయ అధికారి చంద్రదీపక్ ఆధ్వర్యంలో 'వ్యవసాయం.. న్యాయ సలహా' కేంద్రాన్ని జడ్జి ప్రారంభించి మాట్లాడారు. పంట పరిహారం, బీమా, నకిలీ విత్తనాలు తదితర సమస్యల పరిష్కారం కోసం సలహాలు తీసుకోవాలని సూచించారు. సలహాలు ఇవ్వడమే కాకుండా పరిష్కారమార్గం చూపిస్తామని అన్నారు. ఎంపీపీ మిట్టపల్లి విమల, వ్యవసాయ సహాయ సంచాలకురాలు కల్పన, మార్కెట్ కమిటీ చైర్మన్ కోరండ్ల నరేందర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్ పాల్గొన్నారు.

నిర్దేశిత తేమశాతం ఉండాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్: నిర్దేశిత తేమశాతం ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సెర్ప్ డీపీఎం వెంకటేశ్ సూచించారు. పొరండ్లలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లకు నిర్వాహకులకు అందజేయాలని రైతులకు సూచించారు.సర్పంచ్ పొగ్గల సంధ్యారాణి, ఎంపీటీసీ ఆరె సౌజన్య, ఏపీఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

23న బసవేశ్వరుని జయంతి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో మహాత్మా బసవేశ్వర జయంతి ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కలెక్టర్‌యాస్మిన్ బాషా శుక్రవారం తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ



మాట్లాడుతున్న డీఎం లక్ష్మీప్రసూన

కోరుట్ల: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డీఎం లక్ష్మీప్రసూన ఉద్యోగులకు శుక్రవారం వృత్తి నైపుణ్య శిక్షణ ప్రారంభించారు. ట్రెయినర్లు నవీన్ కుమార్, బూర్ల నరేశ్.. వారాంతపు సెలవులో ఉన్న కండక్టర్లకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాలతో ప్రతీరోజు 30 మందికి శిక్షణ ఇస్తామని వారు వివరించారు.

ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించండి

జగిత్యాల: కండక్టర్లు ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని డీఎం వెంకటనర్సప్ప సూచించారు. స్థానిక డిపోలో కండక్టర్లకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. అసిస్టెంట్ మేనేజర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాలిన మామిడి రైతుల ఆశలు

- బలమైన ఈదురుగాలులు ఆ వెంటనే భారీవర్షం
- నేలరాలిన మామిడికాయలు .. దెబ్బతిన్న నువ్వుల పంట
- వరి, మొక్కజొన్న పంటలూ నష్టపోయిన అన్నదాతలు
- ప్రాథమిక అంచనాల్లో వ్యవసాయ, ఉద్యాన అధికారులు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): బలమైన ఈదురుగాలులు.. ఆ వెంటే వచ్చిన భారీవర్షం అన్నదాతల ఆశలను మరోసారి నేలపాలు చేశాయి. చేతికి వస్తున్న వేలాది ఎకరాల్లోని మామిడితోటలను ధ్వంసం చేశాయి.. వందలాది ఎకరాల్లోని నువ్వుల పంటను దొంగదెబ్బ తీశాయి.. వరి పంటకూ తీరని నష్టం కలిగించాయి.. మొక్కజొన్న పంట కూడా నష్టపోయిన రైతులు.. అకాల వర్షం తమను కోలుకోకుండా చేసిందని వాపోతున్నారు. గురువారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనతో జిల్లావ్యాప్తంగా సుమారు 35వేల ఎకరాల్లో మామిడితోటలు ఉండగా, దాదాపు 23,505 ఎకరాల్లో కాయలు రాలిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమై గంటల కొద్దీ సరఫరా నిలిచిపోయింది. రోడ్లపై చెట్లు కూలి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇబ్రహీంపట్నం మండలంలో సుమారు 1,250 ఎకరాల్లో నువ్వు సాగు చేయగా 375 ఎకరాల్లో నష్టం జరిగింది.



రేగుంటలో ఈదురుగాలులు, భారీవర్షానికి రాలిపోయిన మామిడికాయలు

రూ.2 లక్షల నష్టం



నాకున్న ఎనిమిది ఎకరాల మామిడితోటలో ఈసారి కాయలు అంతంతే కాచాయి. రంజాన్ పండుగ తర్వాత కాయలు తెంపి అమ్ముదామనుకున్న. ఈదురుగాలులు దెబ్బతీసినయి. రూ.2 లక్షల నష్టం జరిగింది.

– గడ్డం మహేశ్, రైతు, ఇబ్రహీంపట్నం

నువ్వులకు నష్టం



ఇబ్రహీంపట్నం మండలంలో సుమారు 375 ఎకరాల్లో నువ్వుల పంటకు నష్టం జరిగింది. సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో సర్వే చేశాయ నష్టం వివరాలు తెలిశాయి. ప్రాథమిక అంచనాలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– దీపిక, ఏవో, ఇబ్రహీంపట్నం

లక్ష లాస్..



నాకున్న ఐదెకరాల్లో నువ్వుల పంట ఏసిన. ఇప్పుడే కాతకు వస్తున్నది. ఈదురుగాలులతో పైరు విరిగిపడింది. సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగింది.

– జిల్లాల పవన్, రైతు, ఇబ్రహీంపట్నం

అధికారులకు నివేదిస్తాం



ఈదురుగాలుల ధాటికి మామిడితోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టం అంచనాలు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యనవన శాఖ అధికారి

ఈదురుగాలులకు అవకాశం



వెల్గటూర్ మండలంలో విరిగిపడ్డ మక్కకర్రలు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఆగ్నేయ దిశ నుంచి బలమైన ఈదురుగాలులు గంటకు 12కి.మీ. నుంచి 34 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉన్నట్లు పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 39 డిగ్రీ సెల్సియస్ నుంచి 40 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 22డిగ్రీల సెల్సియస్ నుంచి 24 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశ ఉందన్నారు. గాలిలో తేమ ఉదయం 54శాతం నుంచి 69 శాతం , మధ్యాహ్నం 36 శాతం నుంచి 48 శాతం వరకు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాబోయే ఐదు రోజుల్లో ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఆవేదనలో అన్నదాతలు

సారంగాపూర్(జగిత్యాల): సారంగాపూర్ మండలంలో 102 మంది రైతులకు సుమారు 256.2 ఎకరాల్లో మామిడితోటలు ఉన్నాయి. ఇందులో 89 మందికి చెందిన దాదాపు 220 ఎకరాల్లో మామిడికాయలు రాలిపోయాయి. అత్యధికంగా లక్ష్మీదేవిపల్లి, రేచపల్లి, రంగపేట, సారంగాపూర్ గ్రామాల్లో మామిడికి తీవ్ర నష్టం వాటిల్లింది. బీర్‌పూర్ మండలంలో 82 మంది రైతులు దాదాపు 200.06 ఎకరాల్లో మామిడి పండిస్తుండగా.. 72 మందికి చెందిన దాదాపు 178 ఎకరాల్లో పంట కోల్పోయారు.



లక్ష్మీదేవిపల్లిలో నేలరాలిన మామిడి

ఎల్లుండి తెంపుతామన్నరు



నాకు, నా మిత్రుడు గడ్డం కొమురయ్యకు కలిపి 15 ఎకరాల మామిడితోట ఉంది. రంజాన్ పండుగ తెల్లవారి మా తోట గుత్తపట్టిన వ్యక్తి కాయలు తెంపుత అన్నడు. ఈదురు గాలులకు కాలన్నీ రాలి సుమారు రూ.4 లక్షల వరకు నష్టం జరిగింది.

– దాసరి పెద్దకొమురయ్య, రైతు, లక్ష్మీదేవిపల్లి

కిలోకు రూ.33 మాట్లాడుకున్నరు



నాకున్న నాలుగు ఎకరాల్లోని మామిడి కాయలు శుక్రవారం ఉదయం తెంపడానికి నిర్ణయించుకున్నం. తోట గుత్తపట్టిన వ్యక్తి కిలోకు రూ.33 చొప్పున తీసుకుంటనని ఒప్పందం చేసుకున్నడు. 30 మంది కూలీలను సిద్ధం చేసుకున్నడు. రాత్రికిరాత్రే కాయలు రాలిపోయినయి.– ఏలేటి రవీందర్‌రెడ్డి, రైతు, లక్ష్మీదేవిపల్లి

35 ఎకరాలు గుత్తకు పట్టినం



నాలుగు మండలాల్లో 35 ఎకరాల మామడితోటలు గుత్తకు పట్టినం. నాన్న రమేశ్, మా అమ్మ లక్ష్మి కంటికి రెప్పలా కాపాడుతున్నరు. శుక్రవారం కాయలు తెంపుదామనుకున్నం. ఈదురుగాలలకు కాయలు మొత్తం రాలి సుమారు రూ. 15లక్షల వరకు నష్టం వచ్చింది.

– బూతగడ్డ రాజు, లక్ష్మీదేవిపల్లి

గాలివాన బీభత్సం

కోరుట్లరూరల్: కల్లూరు, పైడిమడుగు, యెఖీన్‌పూర్ తదితర గ్రామాల్లో మామిడికి తీవ్ర నష్టం వాటిల్లింది. నువ్వు పంట తీవ్రంగా దెబ్బతింది. బలమైన గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. ట్రాన్స్‌కో తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలో సుమారు 3,500 ఎకరాల్లో మామిడితోటలు ఉండగా 90 శాతం కాయలు రాలిపోయాయి. దాదాపు 3,200 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. సుమారు 100 ఎకరాల్లో నువ్వు పంట సాగవగా.. పంటంతా నేలవాలింది. తద్వారా దిగుబడి బాగా పడిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. 18వేల ఎకరాల్లో వరి సాగు చేయగా, 90శాతం కోతకు వచ్చింది. ఇందులో 30 ఎకరాల్లోని వరిపైరు నేలవాలింది.



పైడిమడుగులో దెబ్బతిన్న నువ్వుపంట

పైసా పరిహారం రాలే



పదహారేళ్లుగా మామిడి కాయలు అమ్ముతున్న. గాలిదుమారానికి ఇన్నికాయలు ఎప్పుడూ రాలిపోలే. ఎనిమిదేళ్లుగా ఇదే పరిస్థితి. ఎప్పుడు కూడా ప్రభుత్వం పైసా పరిహారం ఇయ్యలే. ఈసారైనా ఆదుకోవాలె.

– పుల్లారెడ్డి, రైతు, అయిలాపూర్

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



వివిధ గ్రామాల్లో సుమారు 3,200 ఎకరాల్లో మామిడికాయలు రాలినట్లు సర్వేలో గుర్తించాం. నువ్వుల పంట 33 శాతం దెబ్బతింది. వరి పంటకు 30 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తాం.

– నాగమణి, ఏవో, కోరుట్ల

నష్టం అపారం

రాయికల్(జగిత్యాల): పట్టణ సమీపంలోని వివిధ తోటలతోపాటు మండల వ్యాప్తంగా ఉన్న 32 గ్రామాల్లో ఈదురుగాలుల ప్రభావం పంటలకు నష్టం కలిగించింది. 70 ఎకరాల్లో వరి 70, 200 ఎకరాల్లో నువ్వుల పంట కూడా దెబ్బతింది. ముఖ్యంగా దావన్‌పల్లి, రామారావుపల్లిలో వరి, కొత్తపేట, మూటపల్లి, అల్లీపూర్ గ్రామాల్లో నువ్వుపంటకు నష్టం వాటిల్లింది. మామిడికి జరిగిన నష్టంపై మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్, హార్టికల్చర్ అధికారులు సర్వే చేపట్టారు.





రాయిల్‌లో దెబ్బతిన్న నువ్వుల పంట

కాయలన్నీ రాలిపోయినయి



నాకు రెండెకరాల ఇరవై గుంటలు ఉంది. అందులో మామిడితోట ఉంది. ఈసారి కాయలు మంచిగా వస్తయనుకున్న. ఈదురు గాలులతో ఒక్కరోజే కాయలన్నీ రాలిపోయినయి. సుమారు రూ.1.50 లక్షల నష్టం జరిగింది.

– ఏలేటి భూమక్క, రైతు, మూటపల్లి

నష్టం బాగా ఉంది



రాయికల్ మండలంలో మామిడి తోటలు అధికంగా ఉన్నయి. ఈసారి మంచి రేటువస్తుందని ఆశించినం. పెద్దమొత్తంలో రైతులకు చెల్లించి గుత్తకు తీసుకున్నం. ఈదురుగాలులతో కాయలన్నీ రాలిపోయినయి.

– ఖదీర్ అహ్మద్, గుత్తాదారు

దెబ్బతిన్న పంటలు

వెల్గటూర్(ధర్మపురి): వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో సుమారు 600 ఎకరాల్లో మామిడిపండ్లు రాలిపోయాయి. సుమారు 40 ఎకరాల్లో వరి, 30 ఎకరాల మొక్కజొన్న, 5 ఎకరాల్లో నువ్వుల పంటకు నష్టం వాటిల్లినట్లు ఏఈవో వినోద్ తెలిపారు.



తడిసి ముద్దయిన పసుపు




ధ్వంసమైన ఇంటి పైకప్పు


ధర్మపురి/కథలాపూర్/మల్లాపూర్/పెగడపల్లి: ధర్మపురి, కథలాపూర్, మల్లాపూర్, పెగడపల్లి మండలాల్లోనూ ఈదురుగాలు, అకాల వర్షం వివిధ పంటలకు తీవ్ర నష్టం కలిగించాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి.




అస్థికలు కలిపేందుకు వచ్చి..

- రోడ్డు ప్రమాదానికి గురై..
- కొత్తపేట వద్ద ప్రైవేట్ బస్సు, లారీ ఢీ
- తీవ్రంగా గాయపడి బస్సు డ్రైవర్ మృతి
- 15మందికి తీవ్రగాయాలు
- మరో పది మందికి స్వల్పగాయాలు
- అందరూ ఒకే కుటుంబానికి చెందినవారు
- చెట్టును తప్పించబోయి ఎదురెదురుగా ఢీకొన్న వాహనాలు
- అధికారుల నిర్లక్ష్యమేనని ఆరోపణలు







మృతుడు మల్లయ్య, ఆస్పత్రిలో గాయపడ్డవారు



ప్రమాదం జరిగిన స్థలంలో వాహనాలు

వెల్గటూర్(ధర్మపురి): తన తల్లి అస్థికలను ధర్మపురి గోదావరి నదిలో కలిపేందుకు మినీ బస్సులో బయలు దేరిన మెదక్ జిల్లా గజ్వేల్ మండలం బేజ్‌గామ్ గ్రామానికి చెందిన ఆకుల దేవేందర్, తన 25మంది కుటుంబసభ్యులు కొత్తపేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఇందులో బస్సు డ్రైవర్ పగిల్ల మల్లయ్య(50) మృతి చెందగా మిగతా వారు తీవ్రగా గాయపడ్డారు. ఇందులో 15మంది కాళ్లు, చేతులు విరిగాయి. మిగతా వారు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఆకుల దేవేందర్ తల్లి అనసూయ ఇటీవల చనిపోయింది. ఆమె అస్థికలను జిల్లాలోని ధర్మపురి గోదావరినదిలో కలిపేందుకు కుటుంబసభ్యులందరూ శుక్రవారం ఉదయం మినీ బస్సులో బయలుదేరారు. బస్సు ఎండపల్లి మండలం కొత్తపేట వద్దకు రాగానే వెల్గటూర్ నుంచి ధర్మారం వైపు వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఒకేకుటుంబానికి చెందిన ఆకుల మంగమ్మ, మౌనిక, శ్రీనివాస్, వెంకటేశం, యాదగిరి, నాగలక్ష్మి, విజయలక్ష్మి, దినేశ్, భాగ్యలక్ష్మి, సుభద్ర, అక్షర, మయాన్షి, మానస, కనకయ్య సహా సుమారు 25 మంది గాయపడ్డారు. 15 మంది కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలపాలయ్యారు. బస్సు క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్ పగిల్ల ఎల్లయ్యను జేసీబీ సాయంతో శ్రమించి బయటకు తీశారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. గాయపడ్డ మిగతావారిని కరీంనగర్, జగిత్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.





కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చెట్టుకొమ్మను తప్పించబోయి..



ప్రమాదానికి కారణమైన చెట్టుకొమ్మలు

వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో గురువారం రాత్రి బలమైన ఈదురుగాలులు వీచాయి. వీటిధాటికి చెట్టుకొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. సాయంత్రం వరకూ వాటిని ఎవరూ తొలగించలేదు. అయితే, ఈ చెట్టుకొమ్మలను తప్పించే ప్రయత్నంలో బస్సు డ్రైవర్ అదుపుతప్పి లారీని ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు



కాలువ పరిశీలిస్తున్న ఈఈ వెంకటేశ్వర్లు

మల్లాపూర్(కోరుట్ల): గతంలో కురిసిన భారీవర్షాలకు దెబ్బతిన్న డి–29 కాలువకు మరమతు చేయించి ఎస్సారెస్పీ నుంచి చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని ఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. కొత్త దాంరాజుపల్లి, సంగెం–శ్రీరాంపూర్, ఒబులాపూర్, తండా గ్రామాల శివారుల్లోని ఎస్సారెస్పీ డి–29 కాలువను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. డి–29 కాలువ ఆయకట్టు చివరి గ్రామాలైన సంగెం–శ్రీరాంపూర్, ఒబులాపూర్, కొత్తదాంరాజుపల్లి, పాతదాంరాజుపల్లి, వాల్గొండ గ్రామాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. మొగిలిపేట పెద్దచెరువు నుంచి చివరి ఆయకట్టు వరకు సీసీ లైనింగ్ చేసేందుకు ప్రభుత్వం గతంలోనే రూ.2.05కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. అయితే, కాంట్రాక్టర్ జాప్యంతోనే పనులు పూర్తికాలేదని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి సీసీ లైనింగ్ పనులు పూర్తిచేయించి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని ఈఈ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ డీఈ దేవానంద్, ఏఈ రాకేశ్, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, సర్పంచులు పాలేపు దిలీప్, బద్దం సరిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బదిలీపై వెళ్తున్న జడ్జికి సన్మానం



సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ కార్యవర్గం

జగిత్యాలజోన్ : జిల్లా కోర్టు మొదటి అదనపు న్యాయమూర్తిగా పనిచేస్తున్న వీరయ్య హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు జగిత్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమా మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థపై నమ్మకం పెంచాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. కార్యక్రమంలో సబ్ జడ్జి ప్రసాద్, రెండవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వినీల్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మహేంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

24న జాబ్‌మేళా

జగిత్యాల : ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 24న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి సత్తమ్మ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగిత్యాలలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రముఖ కంపెనీలు గూగుల్ పే, విజయ బయో ఫర్టిలైజర్, సీసీఈ టెక్నీషియన్స్ తదితర కంపెనీల్లో పలు పోస్టులున్నాయని, ఈనెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 96188 32619 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

నియామకం



లక్ష్మీ నారాయణ

జగిత్యాలజోన్ : జిల్లా కేంద్రంలోని మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది నకుమల్ల లక్ష్మీనారాయణ శుక్రవారం నియామకమయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణను జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీపాల్ రెడ్డి, రామకృష్ణారావు, న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి రూ.3.40 కోట్లు మంజూరు

గొల్లపల్లి: నియోజకవర్గంలోని 34 దేవాలయాలకు రూ.10లక్షల చొప్పున రూ.3.40 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ఇన్‌స్పెక్షన్ అధికారి డా.ఎం.రాంనాదం మండలంలోని రాఘవపట్నం గుండు హనుమాన్ దేవాలయం, లక్ష్మీపూర్‌లోని హనుమాన్ ఆలయం, పోచమ్మ ఆలయం, అబ్బాపూర్‌లోని శివాలయం, ఇబ్రాజపల్లిలోని గాయత్రి ఆలయాలను సందర్శించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా నిధులు మంజూరుకు కృషిచేసిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ బోయపోతు గంగాధర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

మానకొండూరులో తుపాకీ పేలలేదా?

- నిందితుల చేతులపై జీఎస్‌ఆర్ లేదంటున్న పోలీసులు
- అంతా పబ్లిసిటీ స్టంట్ అని కొట్టిపారేసిన ఖాకీలు
- ఇంకా ఆచూకీ చిక్కని నిందితుడు సాయితేజ



నిందితుడు సాయి (ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: మానకొండూరు కాల్పుల కేసు కొత్త మలుపు తిరిగింది. ఈ కేసులో అసలు కాల్పులు జరిగాయా? లేదా అన్న విషయంలో మొదటి నుంచి అనుమానాస్పదంగానే ఉంది. ఘటనాస్థలంలో బుల్లెట్ దొరకడం, బాధితుడు తనపై రెండుసార్లు ఫైర్ చేశారని మీడియా ముందు చెప్పడంతో కాల్పులు జరిగాయని అంతా అనుకున్నారు. దీంతో ఈ విషయాన్ని పోలీసులు శాస్త్రీయంగా నిర్ధారించుకున్నారని సమాచారం. సాధారణంగా తుపాకీ పేల్చిన తరువాత కొన్ని గంటలపాటు అలాగే ఉంటుంది. ఈ నేపథ్యంలో తుపాకీ ఎవరు పట్టుకున్నారు అన్న విషయంలో పోలీసులకు స్పష్టత ఉంది. కానీ, మీడియాలో తుపాకీ కాల్పులు అని నిందితుడు భాషబోయిన అరుణ్ పదేపదే చెబుతుండే సరికి, తమ కస్టడీలో ఉన్న ముగ్గురిని పరీక్షిస్తే.. వారి చేతులపై ఎలాంటి జీఎస్‌ఆర్ (గన్‌షాట్ రెసెడ్యూ) ఆనవాళ్లు లభించలేదని ఓ ఉన్నతాధికారి స్పష్టంచేశారు. అదే విధంగా ఘటనాస్థలంలో కూడా కాల్పులు జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. గోడలకు తూటాల దెబ్బలు, నేలపైనా ఎలాంటి కె్ట్రిడ్జ్ (బుల్లెట్ కాల్చాక కిందపడే భాగం) అవశేషాలు లభించలేదని, కేవలం పేలని ఒక రౌండ్ బుల్లెట్ మాత్రమే లభించిందని వివరించారు.

- పాత నేరస్థుడైన అరుణ్ కేవలం తన పబ్లిసిటీ స్టంట్‌లో భాగంగానే.. సానుభూతి కలిగేలా ఉన్నవి, లేనివి కల్పించి చెబుతున్నాడని అభిప్రాయపడ్డారు. అతనికి గోదావరిఖని సాయి తేజతో ఎలాంటి సంబంధం లేదన్న విషయాన్ని కొట్టిపడేశారు. ఇద్దరు మూడేళ్ల క్రితం వరకు మంచి స్నేహితులు అని పేర్కొన్నారు. మరోవైపు సాయితేజ కోసం హైదరాబాద్ వెళ్లిన ప్రత్యేక బృందానికి కొత్త విషయాలు తెలిశాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం .. బీటెక్ వరకు చదువుకున్న సాయితేజ కొంతకాలంగా గంజాయికి అలవాటుపడ్డాడని, అదే సమయంలో సోదరి ఆకస్మిక మరణం అతన్ని కుంగదీసిందని కుటుంబసభ్యులు తెలిపారు. అయితే.. పదే పదే గొడవల్లో ఇరుక్కుని కుటుంబానికి తలనొప్పిగా మారిన కారణంగా సాయితేజకు తామంతా చాలాకాలంగా దూరంగా ఉంటున్నామని వివరించారు. ఈ సమాధానాలతో పోలీసులు నిరాశచెందారు. నిందితుడు సాయి తన కుటుంబ సభ్యులను కచ్చితంగా సంప్రదించేందుకు వస్తే.. పట్టుకోవచ్చన్న వారి ఆశలపై నీళ్లు చల్లినట్లైంది.

మిత్రుడి కారు.. ఫోన్ స్విచ్ఛాఫ్..

అరుణ్‌పై హత్యాయత్నానికి సాయితేజ గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన అతని స్నేహితుడు స్విఫ్ట్ డిజైర్ కారు తీసుకెళ్లాడని పోలీసులు గుర్తించారు. ఘటన అనంతరం మానకొండూరు నుంచి సాయి హైదరాబాద్ మార్గంలోనే పారిపోయాడని పోలీసుల వద్ద సమాచారం ఉంది. కానీ.. హత్యాయత్నం తరువాత సాయి అనూహ్యంగా సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో అతన్ని పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారింది. సాయికి గంజాయి వ్యాపారులతో సంబంధాలున్న నేపథ్యంలో అతను ఎక్కడ తలదాచుకున్నాడన్నది పోలీసులకు అంతుచిక్కడం లేదు. వీలైనంత త్వరగా పట్టుకుంటామని పోలీసులు మాత్రం ధీమాగా ఉన్నారు.

డబుల్ బెడ్ రూముల హామీ ఏమైంది..?



పాదయాత్ర చేస్తున్న భట్టి విక్రమార్క

- ఇక్కడి పచ్చదనానికి కారణం ఎస్సారెస్పీ కాలువలే..
- ఇసుక మాఫియాతో రోడ్లు ధ్వంసమైనా పట్టదా?
- పోలీసులు ఇసుక మాఫియా కోసం పని చేస్తున్నారు
- ప్రజా సమస్యలపై ధర్నాలు చేస్తే అరెస్టులా..?
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

సాక్షిప్రతినిధి,కరీంనగర్/జమ్మికుంట: హుజూరాబాద్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూముల హామీ ఏమైందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం పీపుల్స్ మార్చ్‌లో భాగంగా ఆయన జమ్మికుంట మండలంలోని నాగంపేట నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తాను నియోజకవర్గంలో ప్రవేశించిన సమయంలో మహిళలంతా తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వస్తాయని ఆశించామని.. అవేమీ సాకారం కాలేదని వాపోయారన్నారు. తమ తరపున ఆ డిమాండ్లు పరిష్కారానికి రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చేలా పోరాడాలని ప్రజలు కోరారని ఆయన తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో దాదాపు 90 వేల ఎకరాల సాగుభూమి కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎస్సారెస్పీ కాలువల కిందే సాగవుతోందని.. కాళేశ్వరం లేదా మరే ఇతర ప్రాజెక్టు కింద ఇక్కడ అదనంగా ఒక్క ఎకరం కూడా సాగు కాలేదని పేర్కొన్నారు. కేసీఆర్ మాటలు నమ్మి ప్రజలు అవకాశమిస్తే.. 10 ఏళ్లు దాటినా 90 వేల ఎకరాలకు మించి ఎకరానికి కూడా అదనంగా నీళ్లివ్వలేదని విమర్శించారు.

ఇసుక మాఫియాతో ఇక్కట్లు

స్థానికంగా మానేరు నది మీద ఇసుక మాఫియా చెలరేగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సామర్థ్యానికి మించిన లారీలు జమ్మికుంట, హన్మకొండ మార్గంలో రోడ్లను ధ్వంసం చేస్తున్నాయని వాపోయారు. రోడ్డు పక్కన జనావాసాలు లారీలతో వచ్చే దుమ్ముతో తీవ్ర అవస్థలు పడుతున్నారని, వారి పరిస్థితిని బాధితులు స్వయంగా ఇళ్లలోకి పిలిచి చూపించారని అన్నారు. ఇసుక లారీలకు వ్యతిరేకంగా ధర్నాలు చేస్తే.. పోలీసులు అరెస్టు చేయడమేంటని విస్మయం వ్యక్తం చేశారు. ఇలాంటి కష్టాలు రావడం తెలంగాణ దౌర్భాగ్యమన్నారు. తాము అధికారంలోకి వస్తే పోలీసులను కేవలం పరిపాలన కోసం తప్ప పక్షపాతానికి వినియోగించమని స్పష్టం చేశారు.

ఇంటికి రాలేదంటూ కాంగ్రెస్ నాయకుని ఆవేదన

30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తున్న, ఎన్ని పార్టీల వాళ్లు ప్రలోభాలు పెట్టినా ఒక్క పైసా ఎవరి దగ్గర తీసుకోలేదని గంగ్రపల్లి గ్రామానికి చెందిన మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు పరశురాం ఆవేదన వ్యక్తం చేశాడు. నిన్న మొన్న పార్టీలోకి వచ్చిన వారి ఇంటికి వెళ్లడమేంటని ప్రశ్నించారు. ఈ బాధ తాను భరించలేనని, పురుగుల మందు తాగుతానని.. పార్టీకి రాజీనామా చేస్తానని కన్నీరు పెట్టుకున్నాడు. దీంతో బల్మూరి వెంకట్, నాయకులు ఇంటికి వచ్చి బుజ్జగించారు.

పలకరిస్తూ.. ముందుకు సాగుతూ..

జమ్మికుంట మండలంలోని గుంపుల క్రాస్ రోడ్డు నుంచి భట్టి పీపుల్‌మార్చ్ పాదయాత్ర ప్రజలతో మమేకమై ముందుకు సాగింది. తనుగుల, గంగ్రపల్లి గ్రామాల వద్ద మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. నాగంపేట గ్రామం దాటిన తర్వాత భోజన విరామం తీసుకున్నారు. సాయంత్రం పాతయాత్ర కొనసాగిస్తూ శాయంపేట, ధర్మారం, కొత్తపల్లికి చేరుకున్నారు. కొత్తపల్లిలో ముస్లింల ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. అనంతరం మడిపల్లి గ్రామ సమీపంలోని శాంతినగర్ కాలనీ వద్ద బస చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సాంబయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెపు సారంగపాణి, సదానందం, పరుశరాం, నియోజవర్గ మైనార్టీ చైర్మన్ ఎండీ సలీం పాషా తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు పరిహారం అందించాలి



ఒడ్డెరకాలనీలో మామిడి రైతులతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- నష్టపోయిన మామిడిపంటల పరిశీలన

రాయికల్: ఈదురుగాలులతో నష్టపోయిన మామిడి రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం అందించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మూటపల్లి, కొత్తపేట, ఒడ్డెరకాలనీలో ఈదురుగాలులతో నష్టపోయిన మామిడి పంటలను ఎమ్మెల్సీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మామిడి రైతులకు ఎకరానికి రూ.50వేలు, మొక్కజొన్నకు ఎకరాకు రూ.10 వేలు అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలతో ఫసల్‌బీమా అమలు కాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా పండ్లు, కూరగాయల పంటలను ప్రోత్సహించేందుకు జిల్లాలో కేవలం ముగ్గురు మాత్రమే ఉద్యానవన శాఖ అధికారులున్నారన్నారు. ప్రభుత్వం ఒక్కో మండలానికి ఒక్కో ఉద్యానవన శాఖ అధికారిని నియమించి రాయితీపై రుణాలు అందించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఆయన వెంట నాయకులు బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, చింతలపల్లి గంగారెడ్డి, మహేందర్ గౌడ్, మండ రమేశ్, ఏలేటి రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లిలో..

సారంగాపూర్ : మామిడి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో ఈదురుగాలులకు నష్టపోయిన మామిడి తోటలను రైతులతో కలిసి పరిశీలించారు. ప్రతి రైతుకు ఎకరాకు కనీసం రూ. 50 వేలు పరిహారం అందించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించలని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి ప్రతాప్‌సింగ్‌ను ఫోన్‌లో కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి, రంజిత్, మహిపాల్ రెడ్డి, సంజీవ రెడ్డి, ఇమామ్, శ్రీధర్, సతీశ్, శేఖర్, రాజు, సాయిపవన్, రాజ్‌కుమార్, జితేందర్ రెడ్డి, మహిపాల్, తదితరులున్నారు.

ఎకరానికి రూ.80 వేలు ఆర్థిక సహాయం అందించాలి

ఈదురుగాలులకు నష్టపోయిన మామిడి రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.80 వేలు పరిహారం అందించాలని అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని రాయికల్, భూపతిపూర్, రామాజీపేట గ్రామాల్లో మామిడితోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నష్టపోయిన రైతులను పరిహారం చెల్లించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఇక్కడ జిల్లా నాయకులు పన్నాల తిరుపతి రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, ఎంపీటీసీ ఆకుల మహేశ్, నాయకులు మంగళారపు లక్ష్మీ నారాయణ, పట్టణ అధ్యక్షుడు ధర్మపురి ఉన్నారు.

చాయ్ మీదపడి బాలుడికి గాయాలు



గాయాలపాలైన బాలుడు

ధర్మపురి : చాయ్ మీద పడి ఓ బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. ధర్మపురిలో నివాసముంటున్న సారథి – రమ్య దంపతులు కుమారుడు సహన్ (2) శుక్రవారం చాయ్ తాగుతుండగా మీదపడటంతో చాతిలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విధుల్లో చేరిన ఎంఈవో



విధుల్లో చేరుతున్నట్లు ఎంఈవో ఆనందరావు

కథలాపూర్ : దీర్ఘకాలిక సెలవుల అనంతరం మండల ఎంఈవో ఆనంద రావు విధుల్లో చేరారు. బొమ్మెన జెడ్పీ హైస్కూల్‌లో గెజిటెడ్ హెడ్మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు అదనంగా కథలాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలకు ఎంఈవోగా బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. గతనెలలో సిరికొండ జెడ్పీ హైస్కూల్‌లో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో జిల్లా అధికారులు ఎంఈవోతోపాటు హెచ్‌ఎంకు మెమో జారీచేశారు. అప్పటి నుంచి ఆనందరావు ఎంఈవోగా విధులు నిర్వర్తించేందుకు ఆసక్తి చూపడంలేదని మండలంలో ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు. ఈనెల 1 నుంచి 20 వరకు ఎంఈవో అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవులో వెళ్లగా శుక్రవారం విధుల్లో చేరారు.

మామిడి రైతులను ఆదుకోవాలి



శేర్ నర్సారెడ్డి

కోరుట్ల : ఈదురుగాలులకు నష్టపోయిన మామిడి రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేతికందే సమయంలో మామిడి కాయలు నేలరాలడంతో రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందన్నారు. పూత, కోత దశలో ఉన్న నువ్వు పంట దెబ్బతిందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

అంజన్నను దర్శించుకున్న రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్



మాట్లాడుతున్న దేవాదాయశాఖ కమిషనర్

కొండగట్టు(చొప్పదండి): రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారిని శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కోనేరు వద్ద తాగునీటి నల్లాలు చలువపందిళ్ల పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రూ.100 కోట్ల అభివృద్ధిలో భాగంగా మాస్టర్ ప్లాన్ జరుగుతుందని, వచ్చే నెలలో జరిగే హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా భక్తులకు అన్నిఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆలయంలో పూర్తిస్థాయి ఉద్యోగులను త్వరలోనే విధుల్లోకి తీసుకుంటామన్నారు. ఆలయ ఏఈవో బిల్లులు చెల్లించడం లేదని కాంట్రాక్టర్లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా బిల్లులు చెల్లించాలన్నారు. పలు విభాగాలకు చెందిన రికార్డులను తనిఖీ చేశారు. చోరీకి గురైన వెండి ఆభరణాల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈవో వెంకటేశ్ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, ఏసీ చంద్రశేఖర్ అధికారులు సునీల్, ధర్మేందర్ శ్రీనివాస చారి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దొంగలు.?

జగిత్యాల క్రైం : జిల్లా కేంద్రంలోని రెండు ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల దొంగతనానికి పాల్పడిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఈనెల 11న రాత్రి ఫోర్ట్‌స్కూల్ ఉర్దూ మీడియం, న్యూ హైస్కూల్ ప్రభుత్వ పాఠశాలల్లో భద్రపరిచిన ఏడు కుట్టుమిషన్లు, విద్యార్థుల ఆట వస్తువులు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో పోలీసులు దొంగతనానికి పాల్పడిన వారిని పట్టుకొని వారి నుంచి కుట్టు మిషన్లతో పాటు ఆట వస్తువులు స్వాధీనం చేసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ముస్లిం నాయకులతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్ : ఇఫ్తార్ విందుతో స్నేహపూర్వక భావం పెంపొందుతుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని లక్ష్మీపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు ఉంటారన్నారు. కాంగ్రెస్ హయాంలో మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేశామని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామిరెడ్డి, బాపురెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ లాకెట్స్ డాలర్ల విక్రయం



డాలర్‌ను కొనుగోలు చేసినట్లు రశీదు తీసుకుంటున్న భక్తుడు

కొండగట్టు (చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయం తరపున లాకెట్స్ డాలర్స్ విక్రయిస్తున్నారు. రూ.40కి రాగి డాలర్ 12గ్రాములు, రూ.35కు రాగి లాకెట్ 8గ్రాములు , రూ.30కి రాగి లాకెట్ 6గ్రాములు భక్తులకు విక్రయిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కొంతమంది భక్తులు కొనుగోలు చేసి రశీదులను తీసుకెళ్లారు. కార్యక్రమంలో అధికారి లక్ష్మారెడ్డి, మంజుల, గండి నర్సయ్య, పాల్గొన్నారు.

అమ్మా నాన్నలకు తోడుగా..



సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో గురువారం ఈదురుగాలులకు మామిడికాయలు నేలరాలగా తీవ్రనష్టం వాటిల్లింది. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడగా రాలినకాయలను వారి పిల్లలు అమ్మ నాన్నలకు తోడుగా రోజంతా మామిడికాయలను ఏరారు.

వేసవిలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలజోన్ : వేసవిలో గ్రామాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోలు, ఐకెపీ ఏపీఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లె ప్రగతిలో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని మే 31 లోపు పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లోని డంప్‌యార్డులను వినియోగంలోకి తీసుకరావాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ మకరంద్ మాట్లాడుతూ... హరితహారం కింద నాటిన మొక్కలు చనిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రామానుజాచార్యులు, డీఆర్డీవో పీడీ లక్ష్మీనారాయణ, డీపీవో నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'పది' మూల్యాంకనం



డీఈవోను సత్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలో మొట్ట మొదటిసారిగా ఏర్పడిన పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ శుక్రవారం ముగిసింది. అయితేగతంలో జిల్లాకేంద్రంలో ఈ కేంద్రం లేకపోవడంతో కరీంనగర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఇక్కడ సాఫ్ట్ వాల్యుయేషన్ కేంద్రం ఏర్పాటు కావడంతో 1,62,024 జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. ఇందులో 450 మంది ఏఈలు, 75 మంది సీఈలు, 150 మంది స్పెషల్ అసిస్టెంట్లు పనిచేశారు.

డీఈవోకు సత్కారం...

మూల్యాంకనం విజయవంతం కావడంతో పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డీఈవో జగన్ మోహన్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, బోయినపల్లి ఆనంద రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రవికుమార్, మహేశ్, శ్రీనివాస్ రెడ్డి, రాజ్‌గోపాల్, తదితరులు పాల్గొన్నారు.